# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## శ్రీవారి ఆలయంలో దీపికాపదుకుణే



తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి: బాలీఉడ్‌నటి దీపికాపదుకుణే శుక్రవారం ఉదయం తిరుమలకు చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలపలకు వచ్చిన ఆమెను చూడటానికి, సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు, భక్తులు ఉత్సాహం చూపారు. అందరికీ చేయెత్తి చూపుతూ ముందుకు కదిలింది.

## పొగమంచుతో పాపవినాశనం శ్రీవారి పాదాలు మార్గం మూసివేత

తిరుమల,డిసెంబర్ 15ప్రభాతవార్తప్రతినిధి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శేషాచలంలోని తిరుమలగిరులపై పొగమంచు దట్టంగా కమ్మేస్తోంది. దీంతో సాయంత్రం 4గంటల ప్రాంతంలోనే కొండపై పాపవినాశనం, శ్రీవారిపాదాలకు వెళ్ళే మార్గంలో పొగమంచుతో రోడ్లన్నీ కమ్మేస్తున్నాయి. దారితెలియక,...వాహనాలు దగ్గరగా వస్తేగానీ గుర్తించలేని పరిస్థితి. ఈ కారణంగా శుక్రవారం సాయంత్రం 5గంటల నుండి శనివారం ఉదయం 6గంటల వరకు పాపవినాశనం, శ్రీవారిపాదాలకు వెళ్ళే మార్గాలను పూర్తిగా మూసివేసి వాహనాలను,భక్తులను అనుమతించడం లేదు. తిరుమలలో చలితీవ్రత పెరిగింది. భక్తులు చాలామంది సాయంత్రం 5గంటల తరువాత గదుల నుంచి బయటకు రావాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవడం కనిపిస్తోంది.

# బల ప్రదర్శనలలో నేతలు.. బలహీనపడిన అన్నదాతలు



తుపాను దెబ్బతో ఇసుకమేట వేసిన పొలం

తడ, డిసెంబర్ 15 ప్రభాతవార్త

అధికార పార్టీ నాయకులు బల ప్రదర్శనలతో విందులు, వినోదాలతో కాలం గడుపుతుంటే అన్నదాతలు హాహాకారాలతో ఆకలితో అలమటిస్తున్నారు. ఇటీవల మిచౌంగ్ తుపాను, ఆ తర్వాత వచ్చిన వరద కారణంగా సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని మెజారిటీ గ్రామాల్లో పంటనష్టం ఎక్కువగా జరిగింది. నీళ్లలో మునిగి ఏపుగా పెరిగిన వరిపంట పాడైపోవడం, ఇసుకమేటలు వేసి పంట పొలాలు జలాశయాలుగా మారిపోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. నియోజకవర్గ పరిధిలోని తీరప్రాంత గ్రామాల రోడ్లు పూర్తిగా దెబ్బతిని ఇప్పటికీ రాకపోకలు సాధ్యం కావడం లేదు. ఆఖరుకి కేంద్ర బృందం కూడా ఈ ప్రాంతంలో పర్యటించి వెళ్లింది. అయితే పూర్తిస్థాయిలో ఆ బృందానికి కష్టనష్టాలు చూపించలేకపోయారు. ఒకచోట ఉండి ఫొటో ఎగ్జిబిషన్‌కు ఎక్కువ సమయం కేటాయించారు తప్ప ఈ బృందం పులికాట్ దీవులు వంటి సమస్యాత్మక గ్రామాలను సందర్శించలేకపోయింది. దొరవారిసత్రం మండలం మీజూరు, కారికాడు, వేలుకాడు, సూళ్లూరుపేట మండలం కొరిడి, దామరాయ, కొల్లపట్టు, తడ మండలం వేనాడు, ఇరకం, వాటంబేడు వంటి ప్రాంతాల్లో వరద నష్టం అంతా ఇంతా కాదు. అక్కడ వారంరోజుల పాటు జనజీవనం స్తంభించిపోయింది. ఇప్పటికీ కాళంగి నదికి పడిన గండ్ల వల్ల వరద నీరు యథేచ్ఛగా ప్రవహిస్తోంది. పైన చెప్పుకున్న ఏ ఒక్క దీవిని కూడా కేంద్ర బృందం సందర్శించకుండా తిరిగి వెళ్లిపోవడం ముఖ్యంగా రైతుల్లో ఆవేదన కనిపిస్తోంది. అధికార పార్టీ నాయకులు కేంద్ర బృందంతో అరకొరా మాత్రమే ఉన్నారు. ఎక్కడా అత్యంత సమస్య ఉందో అక్కడికి ఈ బృందాన్ని తీసుకెళ్లడంలో నేతలు విఫలమయ్యారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తమ నియోజకవర్గంలో జరిగిన కష్టనష్టాలను తెలియజెప్పే పనిలో అధికారుల వెంట ఉన్నారు. అయితే సొంత గ్రామం కాదలూరు, సొంత ఎంపిటిసి సెగ్మెంట్ పులివేంద్ర తప్ప మరో గ్రామాన్ని ఆయన చూపించలేకపోయారు. ఇదిలావుంటే గురువారం, శుక్రవారం సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలు గ్రూపుల తగాదాలతో బలప్రదర్శనలతో నిండుగా కనిపించాయి. దొరవారిసత్రం మండలంలోని ఒక తోటలో ఎమ్మెల్యే కిలివేటికి వ్యతిరేక వర్గీయులు పెద్దసంఖ్యలో సమావేశమై సంజీవయ్య బైబై అంటూ నినాదాలిచ్చారు. కనీసం 500 మందికి అక్కడ విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం. అది జరిగిన కొన్ని గంటల్లోనే శుక్రవారం నాయుడుపేట వద్ద ఒక కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే సంజీవయ్య వర్గం దానికి రెట్టించి ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ వెయ్యిమంది వరకు విందు ఆరగించినట్లు తెలిసింది. తుపాను, వరద బాధితులు కష్టనష్టాలు చూసి కన్నీళ్లు కార్చుతుంటే అధికార పార్టీ నేతలు మాత్రం తమ వర్గీయులకు, అనుకూల కార్యకర్తలకు విందులు ఏర్పాటు చేస్తూ అధిష్టానం దృష్టిలో పడేందుకు ఉత్సాహం చూపించడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. సూళ్లూరుపేట ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గ పరిధిలో గతంలో ఎన్నడూ ఇటువంటి వర్గ రాజకీయాలు ఏ పార్టీలోనూ జరగలేదని అసలు సిసలు వైసీపీ కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు. నేతలు ఇప్పటికైనా తమ సమస్యలు కూడా పట్టించుకోవాలని, సమస్యలకు పరిష్కారం చూపిస్తే టికెట్లు అవే తాము చెప్పిన వారికి వస్తాయని రైతులు, బాధితులు పేర్కొంటున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొడ్తారా!

### - ఆర్డీఓ కార్యాలయం ఎదుట నల్ల గుడ్డలతో నిరసన



ఆర్డీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన.

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:

అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం అర్ధరాత్రి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం దారుణమని ఎఐటియుసి, సిఐటియు నాయకులు ధ్వజమెత్తారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నల్లగుడ్డలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలు నిర్వహించి సమస్యలను పరిష్కరించకుండా నానబెట్టడంతో ఈ దారుణ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. అంగన్‌వాడీల సమ్మెతో ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా దౌర్జన్యాలు చేయడం పద్దతి కాదన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటాలను అణచివేయడానికి ప్రయత్నించడం సబబు కాదని ఆరోపించారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే పోరాటంను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.చైతన్య, ఎఐటియుసి నాయకులు నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ప్రేమ, సుజని, బుజ్జి, జ్యోతి, ప్రభావతి, రమాదేవి, గోపినాథ్, మణి, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## నిధుల శాపం : రైతులు సతమతం

### తెగిన బ్రాహ్మణ చెరువుకు మట్టితోసి చేతులు దులుపుకున్న ఇరిగేషన్ అధికారులు

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం వ్యవసాయ ప్రధానమైన ప్రాంతం. ఈ మండలం స్వర్ణముఖీతీరాన వెలసి ఉంది. అంతేకాక పేరెన్నికగన్న చెరువులున్నాయి. నాడు రాజులు చైన్ లింక్ చెరువులుగా తీర్చిదిద్దారు. మించెన్ తుఫానుకు చెరువులు నిండాయి ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామానికి సంబం దించిన బ్రాహ్మణ చెరువు కలుజు వద్ద తెగింది. అయితే ఈ సమస్యను గుర్తించిన ఇరిగేషన్ శాఖ కు రైతులు సమాచారం అందించగా వారు స్పందించారు. జెసిబిలు పెట్టి మట్టి తొలారు. దాంతో రైతులు ఇక తమ చెరువుకు మహర్ధశ అనుకున్నారు.కానీ ఇరిగేషన్ అధికారులు ఒక్కగంట పని చేయించి ఉడాయించారు. శుక్రవారం ఉదయం నుంచి ముసార పట్టుకుంది.మళ్ళీ తుఫాను హెచ్చరికలు వైరల్ అవుతున్నాయి. దాంతో రైతుల్లో ఆందోళన చోటు చేసుకుంది. ఈ చెరువుతో పాటు ఏడు చెరువులకు లింక్ ఉంది. ఈ చెరువు కింద సుమారు 125 ఆయకట్టు ఉంది. నవంబర్ మాసంలో చోటు చేసుకున్న తుఫానుకు ముందు రైతులు వరినార్లు పోసుకొని నాట్లు కూడా ప్రారంభించారు. చెరువు కలుజు వద్ద కట్ట తెగటంతో వేసిన పైర్లు నీట మునిగాయి.

**ఇసుకమేటలతో ఇక్కట్లు:**

బ్రాహ్మణ చెరువు కలుజు వద్ద కట్ట తెగటంతో నీళ్లు పంట పొలాల మీద ప్రవహించాయి. దాంతో సుమారు 50 ఎకరాల్లో ఇసుక మేటలేసింది. ఈ రైతులు ఇసుకను ఎప్పటికి తొలగించుకోవాలనే మీమాంశలో ఉన్నారు.గోరుచుట్టుపై రోకలి పోటు అన్నట్లు మారింది.ప్రస్తుతం కొందరు రైతులు నార్లు పోసుకున్నారు.మళ్ళీ వర్షాలంటే దిక్కుతోచని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. వ్యవసాయం సాగితేనేఈ ప్రాంత రైతులకు జీవనంఅలాంటిది రెండు సంవత్సరాలుగా వర్షాలతో తల్లడిల్లుతున్నారు.ఈ ఏడాది రాక రాక వర్షం వస్తే చెరువు తెగి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్ అధికారులేమో నిధుల్లేవని చేతులేత్తేసినట్లు రైతులు చెబుతున్నారు.వ్యవసాయం ఎలా సాగించాలనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

## తిరుపతి జిల్లాలో వైసీపీ జెండా రెపరెపలాడుతుంది

### తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

నాయుడుపేట, డిసెంబర్ 15 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా పరిధిలోని 7 నియోజకవర్గాలలో వైసీపీ జెండా రెపరెపలాడుతుందని జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం నాయుడుపేట లోని కెఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నియోజకవర్గ పరిశీలకులు మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, మనమందరం కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నినాదమైన వై నాట్ 175కే కట్టుబడి పనిచేయాలన్నారు. తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో వైసీపీ జెండా రెపరెపలాడుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో ప్రజలు మెచ్చిన వ్యక్తినే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తారన్నారు. ప్రతిపక్షాలు ఎల్లో మీడియా ద్వారా ప్రభుత్వంపై ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తోందని, రాష్ట్రంలో ఎల్లో మీడియా చేస్తున్న విష ప్రచారాన్ని ధీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో గత ఎన్నికల కంటే అధిక మెజారిటీ సాధించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మనమందరం కలిసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి మనమందరం కట్టుబడి ఉండాలని ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేపై అసంతృప్తితో ఉన్న నాయకులు దుష్ప్రచారం చేయవద్దని హితవు పలికారు. అందరూ సమష్టిగా పనిచేసి రానున్న ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ విఆర్వో

### - పాసుపుస్తకాల్లో తప్పులు సరిదిద్దేందుకు లంచం !!

కుప్పం,డిసెంబర్ 15 ప్రభాతవార్త



పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు సరిదిద్దేందుకు లంచం తీసుకుంటూ ఓ విఆర్వో అవినీతి నిరోధకశాఖ (ఎసిబి)కి పట్టుబడిన సంఘటన రామకుప్పం మండలం రాజుపేటలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి తిరుపతి ఎసిబి అదనపు డిఎస్పీ దేవ ప్రసాద్ తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని నక్కబాలేపల్లికి చెందిన మునిరత్నంకు ఇద్దరు సోదరులు. వీరి తల్లి ఏడెనిమిదేళ్ల క్రితం చనిపోగా అన్నదమ్ములు ముగ్గురు భూములు పంచుకునా న్నరన్నారు. ఈ భూములకు సంబంధించి ముగ్గురి పాసు పుస్తకాల్లో తప్పులు రావడంతో వాటిని సరిదిద్దాలని మునిరత్నం బందార్లపల్లి విఆర్వో ఆనందప్పను కలిశాడన్నారు. అయితే ఇందుకుగాను విఆర్వో ఆనందప్ప ముప్పైఐదువేల లంచం అడిగాడన్నారు. అయితే పాతికవేలు ఇస్తానని మునిరత్నం అంగీకరించాడన్నారు. ఈ నేపథ్యంలో మునిరత్నం 14400నెంబరుకు ఫోన్‌చేసి తమకు పూర్తి సమాచారం అందించాడన్నారు. శుక్రవారం రాజుపేట గ్రామంలో మునిరత్నం నుంచి విఆర్వో ఆనందప్ప పాతికవేలు నగదు తీసుకుంటూ పటు ్టబడ్డాడన్నారు. ఈసంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.కాగా ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే 14400నెంబరుకు సమాచారం అందించాలని ఎసిబి డిఎస్పీ కోరారు. ఈ దాడుల్లో ఎసిబి అధికారులు వెంకటరమణ,సూర్యనారాయణ పాల్గొన్నారు.

## స్విమ్స్‌లో 59 మంది రెగ్యులర్ డాక్టర్స్ నియామకం

తిరుపతి టౌన్, డిసెంబర్ 15, ప్రభాతవార్త



స్విమ్స్‌లో శుక్రవారం డైరెక్టర్ 59 మంది డాక్టర్లకు రెగ్యులర్ నియామక ఉత్తర్వులు అందజేసినట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ డా. అపర్ణ బిట్లా తెలిపారు. టిటిడి వారు ఆదేశాల మేరకు స్విమ్స్ హాస్పిటల్ నందు డాక్టర్ల నియామకానికి ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా డిసెంబర్ 11,12,13 తేదీలలో సెలక్షన్ కమిటి ద్వారా నిర్వహించిన ఇంటర్వ్యూలలో 59 మందిని అర్హతలు, అనుభవం ఆధారంగా ఎంపిక చేసారు. వారిని శాశ్వత ప్రతిపాదికన నియామకాలు చేశారు. అందులో ప్రొపెసర్ పోస్టు 1, అసోసియేట్ ప్రొఫెసర్లు 9, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 49 మంది ఎంపిక కాగా వారికి నియామక పత్రాలను సిమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్, డీన్ డా. అలాడి మోహన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ బిట్లా అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్ బాబు, ఎస్టాబ్లిష్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ మొదలైన వర్షం - అన్నదాతల్లో గుబులు



నీట మునిగిన పంట పొలాలు

దొరవారిసత్రం, డిసెంబర్ 15 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఆకాశం మేఘావృతమై వర్షం మళ్లీ మొదలైంది. శుక్రవారం వేకువజాము నుంచే వర్షం కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. మొన్న వచ్చిన మిచౌంగ్ తుపానుకు రోడ్లు, పంట పొలాలు దెబ్బతినడం మరువక ముందే మళ్లీ వర్షం కురుస్తుండటంతో ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొరవారిసత్రం మండలం బురదమడుగు, తనయాలి, కట్టవపల్లి, పూలతోట, పులికాట్ తీరప్రాంతాలైన మీజూరు, వేలికాడు, కారికాడు తదితర గ్రామాల్లో వర్షపునీరు చేరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మళ్లీ వర్షం కురుస్తుండటంతో రోడ్లు దెబ్బతిని గ్రామాలకు రాకపోకలు స్తంభిస్తాయని, పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు సోషల్ మీడియాలో విచ్చలవిడిగా మళ్లీ తుపాను అని సమాచారం వస్తుండటంతో గ్రామాల్లో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

## కాణిపాకంలో పోటెత్తిన అయ్యప్ప భక్తుల రద్దీ



కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం శుక్రవారం పోటెత్తిన అయ్యప్ప భక్తుల రద్దీతో జనసంద్రంగా తయారైంది.సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు, వరుస సెలవు రోజుల్లో భక్తుల రద్దీ వుంటుంది.అయితే గత కొద్ది రోజులుగా కార్తీకమాసం సందర్భంగా శబరిమల ఆలయంలో దర్శనాలు ప్రారంభం కావడంతో అయ్యప్ప దర్శనం కోసం వెళ్ళిన భక్తులు తిరుగు ప్రయాణంలో పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా కాణిపాకం ఆలయ దర్శనార్థం వస్తున్నారు. ఈ మేరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలకు చెందిన అయ్యప్ప భక్తులు కాణి పాకం స్వామిదర్శనం కోసం భారీగా తరలివచ్చారు. సా ధారణ భక్తులతో పాటు అయ్యప్ప భక్తులు తరలి రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో విపరీతమైన రద్దీ నెలకొంది. వేకువజామున నుండి ఆలయంలోని క్యూలై న్లన్ని అయ్యప్ప భక్తులతో కిటకిటలాడాయి. అయ్యప్ప భక్తులు వేకువజామున నుండి స్వామి దర్శనంకోసం క్యూలైన్లలో బారులు తీరి నిలబడ్డారు.ఆలయ క్యూకాం ప్లెక్స్, క్యూలైన్లు పూర్తిగా నిండిపోవడంతో ఆలయం వెలుపల భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం బారులు తీరి వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో గంటల తరబడి వేచివుండడం గమనార్హం. అలాగే అయ్యప్పభక్తులు వచ్చిన వివిధ రకాల వాహనాలతో కాణిపాకం పార్కింగ్ స్థలాలు, పరిసరాలన్ని నిండిపోయాయి. వారంతపు రోజులైన శనివారం

## నేటి నుంచి ధనుర్మాసం పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఉదయం నుంచి ధనుర్మాసం పూజలు, సేవలు, ప్రతి రోజూ పట్టణంలో గౌరమ్మ దర్శనం మొదలు కానుంది.ఈ నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ధనుర్మాసంలో ప్రతి రోజూ అమ్మవారు గొబ్బెమ్మగా పుర ప్రదర్శన జరపటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో గ్రామోత్సవం నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. అమ్మవారు గ్రామోత్సవంతో తిరిగి ఆలయంలోనికి ప్రవేశించిన తరువాతనే అభిషేకాలు నిర్వహించుటకు వీలుంటుంది. ఇందుకు తగ్గట్టు అభిషేకాల సమయాలను కూడా మార్చారు.ప్రతి నెల ఆలయంలో ధార్మిక కార్యక్రమాలకు పెద్ద పీట వేస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,ఆలయ ఇఓ కె.యస్.రామారావు స్థానిక సంప్రదాయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.ఈ నేపథ్యంలో ధార్మిక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

**దర్శన వేళల్లో మార్పులు . . .**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా దర్శనవేళలు మార్పు చేసినట్లు ఇఓ కె.యస్. రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల 15 వరకు దర్శన వేళలను ఉత్సవాల వివరాల్ని ఆయన ప్రకటించారు. నెల రోజుల పాటు దర్శన వేళలకు సంబంధించి వివరిస్తూ వేకువ జాము 3గంటలకు

### గొబ్బెమ్మ దర్శనం

పురవీదుల్లో జేగంట పంపుట. 4గంటలకు మంగళ వాయిద్యాలు,, 4.15 గంటలకు తిరుమంజనం 4.30గంటలకు గోపూజ, పళ్ళియార, తేవారం ఉంది. 5గంటలకు ప్రథమ కాలభికేం, (సేవలుండవు) 6గంటలకు ద్వితీయకాలాభికేం, (సేవల్లేదు), 7గంటలకు పరివార దేవతలకు నైవేద్యం, 7.30గంటలకు గొబ్బి ఉత్సవం, 10.30 గంటలకు ఉచ్చికాల అభికేం, సాయంత్రం 5గంటలకు ప్రదో కాలాభికేం,రాత్రి మంగళవారం, బుధవారం, గురువారం రాత్రి 8.30గంటలకు పళ్ళియార, శుక్ర,శని,ఆది,సోమవారం రాత్రి9గంటలకు పళ్ళియార కార్యక్రమాలుంటాయని వివరించారు.

**27న ఆరుద్ర:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే అభిషేకాల్లో శివయ్య జన్మదిన నక్షత్రం సందర్భంగా నిర్వహించే అభిషేకాన్ని అరుద్రాభిషేకంఅంటారు.ఈ అభిషేకం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు వివరించారు.

## వర్షాలపై ముందుజాగ్రత్తలు అవసరం



**శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 15 ప్రభాతవార్త** రైతులను ఆదుకొనుటకు ప్రభుత్వం సిద్దంగా ఉందని మళ్ళీ వర్షసూచనలువ చ్చాయని రైతులు అప్రమత్తంగా ఉండాలని చెరువులకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు శాసనసభ్యులు బియ్యపు మధుసూధనరెడ్డికి అలాగే ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకురావాలని మండల వైకాపా ఇన్‌చార్జి వయ్యాల కృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆయన మండలంలోని వేలవేడు గ్రామంలో విస్తృతంగా పర్యటించి గత తుఫానుకు నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు చెలికం కృష్ణారెడ్డి, సురేంద్రయాదవ్, గుణశేఖర్‌రెడ్డి, గురునాధ్‌కుమార్, వెంకటరెడ్డి, డివి.రమణ, చంద్రారెడ్డి, గ్రామ వాలంటీర్లు, కార్యదర్శులు ఉన్నారు.

## మిచౌంగ్ తుఫాను బాధితులకు ఆర్థికసాయం



**తొట్టంబేడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త**

నియోజకవర్గంలోని తొట్టంబేడు మండల పంచాయతీ పరిధిలోని మిచౌంగ్ తుఫాను వల్ల కూలిపోయిన ఇండ్లకు సంబందించి 44మంది లబ్దిదారులకు సచివాలయ-1లో సర్పంచ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సచివాలయంలో ఆర్థికసాయాన్ని అందించారు. నియోజకవర్గ ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జి బియ్యపుపవిత్రారెడ్డి సూచనల మేరకు మండల ఎంపిపి ఉన్నం నిర్మల, వైస్ ఎంపిపి మల్లికమ్మ, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడుల సమక్షంలో తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికీ రూ.1000లు చొప్పున నగదును అందించారు. కార్యక్రమంలో విఆర్ఓ మునికుమారి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒక్క ఛాన్స్ అని రాష్ట్రాన్ని దోచుకుంటున్న వైకాపా

-గాలిచలపతినాయుడు



**తొట్టంబేడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త**

బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం లో తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పిలుపులో భాగంగా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కనపర్తి పంచాయతీలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశంపార్టీ ప్రవేశపెట్టిన మినీ మ్యానిఫెస్టోలో పొందుపరచిన విధంగా ప్రతి ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంచుతూ మినిమేనిఫ్యాస్టోను వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటసుబ్బయ్య, బూత్ కన్వీనర్ చలపతి, బత్తెమ్మ, మాజీ సర్పంచ్ వెంకటరమణయ్య తెదేపా కుటుంబసభ్యులు పాల్గొన్నారు

## రాజీవ్‌నగర్ కాలనీని అభివృద్ధి చేయండి..

-100కుటుంబాలు తెదేపాలో చేరిక

-సుధీర్‌రెడ్డికి వినతి



**శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త**

పట్టణంలోని 19,20 వార్డు రాజీవ్‌నగర్ కాలనీలో రోడ్లు అద్వాన్నంగా మారాయని, పట్టించుకునే దిక్కులేదని పలువురు కాలనీ వాసులు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, బొజ్జలరిషితారెడ్డి, బొజ్జలబృందమ్మలకు విన్నవించారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె పట్టణానికి సమీపంలో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో పర్యటించి కాలనీలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్ళి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వాలు మారినా రాజీవ్‌నగర్ కాలనీలో మాత్రం సదుపాయాలు కరువయ్యాయని వర్షానికి ప్రధాన రోడ్డు బురదమయం కావడంతో ఇబ్బందిగా మారిందని పలువురు తెలిపారు. అనంతరం చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం పట్టణంలోని కార్యక్రమంలో విజయకుమార్‌నాయుడుతో పాటు రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి, చెంచయ్యనాయుడు, దశరధాచారి, సుమతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ప్రారంభమైన వికసిత్ భారత్ సంకల్పయాత్ర

**తొట్టంబేడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త**

కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం గుండేలిగుంట పంచాయతీలో శుక్రవారం కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ కన్వీనర్ కోలా.ఆనంద్‌కుమార్ విచ్చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ లబ్దిదారులకు ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు, రేషన్‌బియ్యం, హెల్త్‌కార్డులు, అనేక కేంద్ర సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అనంతరం వాటిని సక్రమంగా అమలు జరిగేలా చర్యలుతీసుకోవాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు పిలుపునిచ్చారు. అనంతరం వికసిత్ సంకల్పయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మరియు అసెంబ్లీ పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సూరిపాకులసుబ్రమణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు నరేంద్రరెడ్డి, కొండేటిగోపాల్, మండల అధ్యక్షులు వేడాం కృష్ణయ్య, ఇన్‌ఛార్జి కుప్పా ప్రసాద్, కోట.వెంకటేష్, రాజనాల, పంచాయతీ కార్యదర్శి కందుకూరి.ఆనందబాబు, మరియు మండల సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలపై జగన్ మార్కు దాడులు

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త**



తల్లిని మరపించే వాత్సల్యాన్ని చూపే అంగన్‌వాడీ కార్యకర్తలపై అధికార జులుం ప్రదర్శిస్తూ తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేస్తున్న అంగన్‌వాడీల శాంతియుత పోరాటంపై జగన్‌మార్కు దాడులు జరుగుతున్నాయని బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆలనా పాలనా చూస్తు గర్భిణీస్త్రీలకు అవసరమైన మేరకు ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు ఇస్తూ పౌష్టికాహార కేంద్రాలుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలపై భౌతిక దాడులకు పురిగొల్పుతున్న వైఎస్ జగన్‌రెడ్డి నిరంకుశ పాలనకు అంతిమరోజులు దగ్గరపడ్డాయన్నారు. విధి నిర్వహణలో తమకు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమానవేతనం, ఉద్యోగ విరమణ అనంతరం తమ జీవితానికి భరోసా కల్పించేందుకు అవసరమైన విధంగా రూ.5లక్షలు గ్రాట్యూటీ, కనీస వేతనం రూ.26వేలు తదితర డిమాండ్లు పరిష్కరించుకోవడానికి అవసరమైన కార్యకర్తలు చేస్తున్న న్యాయపరమైన పోరాటానికి సమాజంలోని ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలన్నారు.

## సురక్షిత రహదారిపై అవగాహన ర్యాలీ

**.తొట్టంబేడు, డిసెంబర్ 15 ప్రభాతవార్త**



పట్టణంలోని ధర్మరాజులస్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీచైతన్య పాఠశాల బ్రాంచి-3లో సురక్షిత రహదారిపై అవగాహన ర్యాలీనిర్వహించారు. ర్యాలీని శ్రీకాళహస్తి ట్రాఫిక్ సిఐ వెంకటప్ప, ఎఎస్ఐ రియాజ్‌లు పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎఎస్ఐ రియాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, ద్విచక్రవాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి వారి ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమం చేసిన శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ కేదార్‌నాథ్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు మద్దతుగా తెదేపా ర్యాలీ

**శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తిరూరల్, తొట్టంబేడు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న వర్కర్లు, హెల్పర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న దీక్షకు తెలుగుదేశంపార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ర్యాలీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతుగా బొజ్జలరిషితారెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష,తదితరులు ర్యాలీలో పాల్గొనగా సిఐటియు,ఎఐటియుసి, ఐఎఫ్‌టియు యూనియన్లకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

## సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**నారాయణవనం, డిసెంబర్ 15 ప్రభాతవార్త :**



ప్రజా సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు పరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్ళీ ప్రజలు పట్టం కట్టాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని కశిమిట్ట గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయంను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అర్హులైనా వారికి సంక్షేమ పథకాలు రాకుండా వుంటే వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. సంక్షేమ పథకాలు మళ్లీ అమలు జరగాలంటే సిఎంగా జన్‌మోహన్‌రెడ్డి ని గెలిపించాలని కోరారు. అనంతరం ఇటీవల కురిసిన వర్షా ని న్టపోయిన బాధిత కటుంబాలకు ఆర్థికసాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, సర్పంచ్ అయ్యప్ప శశికళ, సచివాలయం కన్వీనర్ కోనేటి బాబు, మండల కో ఆప్షన్‌మెంబర్ సోడా మణిరెడ్డి, ఎస్ఐ పరమేష్‌నాయక్, పిఆర్, అర్‌డబ్ల్యుఎస్ డిఇఇలు మధుసూదన్, ధనంజయులునాయుడు, ఎంపిడిఓ కృష్ణమూర్తి, తహశీల్దారు ప్రమీల, నారాయణవనం ఎఓ శోభారాణి, మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్, పశువైద్యాధికారి కుమార్, డాక్టర్ భార్గవి, ఇరిగేషన్ ఎఇఇ మలర్, విద్యుత్‌శాఖ ఎఇ ప్రకాష్‌బాబు, ఇజిఎస్ ఎపిఓ సుకన్య, వెలుగు ఎపిఎం మమత, ఎఎస్ఐ జయరాం నాయక్, కె.సాయిరవి, రమేష్, రామమూర్తి, మురుగేశం, అయ్యప్ప శశికళ, కార్యదర్శులు బాలాజీనాయుడు, కిషోర్‌కుమార్‌రాజు, సుజన, గీత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## "పులివర్తి సుధారెడ్డి"కి .. అడుగడుగునా జన నీరాజనం

**చంద్రగిరి, డిశంబర్ 15 ప్రభాతవార్త:**



చంద్రగిరి బీడి కాలనీ, వికలాంగుల కాలనీ, అక్కగార్ల కాలనీ, సప్తగిరి కాలనీ (జోగుల కాలనీ)లో శుక్రవారం టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డికి జనం నీరాజనలు పలికారు. శుక్రవారం ఆమె మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్ళి చంద్రబాబు ప్రకటించిన 6 గ్యారెంటీ పథకాలను వివరించిన ఆమె చంద్రబాబుతోనే మన జీవితాలు బాగుపడతాయని అన్నారు. చంద్రగిరి టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నాని విజయం కోసం మీరంతా సహకరించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో సింగు సుధ, వీరంగారి రమేష్ రెడ్డి, శివకోటి రెడ్డి, పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, గౌస్‌భాషా, లంకెళ్ళ లలిత, కొండూరు ప్రవీణ్ రాయల్, ఏ.జి.పల్లి బాల, సక్కుర్ ధనంజయ రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, పెరుమాళ్ పల్లి రఘునాధ రెడ్డి, లీలాకృష్ణ, అమ్ములు నాగరాజు, రాధమ్మ, సునీత, నాయుడమ్మ, ప్రభాకర్ నాయుడు, మన్సూర్, సునీల్ నాయుడు, గురుమూర్తి రెడ్డి, శంకర్, హరి, మండలం లోకేష్ రాయల్, వీరంగారి మహేష్ రెడ్డి, రేణుక, సుబ్బమ్మ, మాదవి, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి భక్తుల విరాళం

**చంద్రగిరి డిశంబర్ 15 ప్రభాతవార్త:**



చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భక్తులు విరాళం అందజేశారు. చంద్రగిరికి చెందిన వరదారెడ్డిగారి పావనీ ఢిల్లీ ప్రసాద్ రెడ్డి రూ.50,101/-లు, అదేవిధంగా నడింపల్లికి చెందిన కొమ్మినేని రేవతి పుండరీక నాయుడు రూ.1,00,000/-లు విరాళం ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ సి.ఆర్.తిమ్మారెడ్డిలకు అందజేశారు. ఈ నేపథ్యంలో భక్తులకు అమ్మవారి దర్శన సౌకర్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## అంగన్‌వాడీల వినూత్న నిరసన

**చంద్రగిరి, డిశంబర్ 15 ప్రభాతవార్త:**



తమ డిమాండ్ల సాధన కోసం అంగవాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో శుక్రవారం రెవెన్యూ కార్యాలయం ఎదుట వినూతన్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు. నల్లటి వస్త్రాలు ధరించి రెవెన్యూ బైఠాయించిన అంగన్‌వాడీలు అమ్మవారి పూనకం వచ్చిన రీతిలో వేపమండలు చేత ధరించి ఊగిపోతూ తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆక్రోశించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వాణీశ్రీ, నాగభూషణమ్మ, లీలా, వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొన్నారు.

## యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలి

గాలి భానుప్రకాశ్



**పుత్తూరు, డిసెంబరు 15 ప్రభాతవార్త :** ఈ నెల 20వ తేదీన విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో జరగనున్న యువగళం ముగింపు సభను జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరి పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైకో జగన్మోహనరెడ్డి యువగళం పాదయాత్రకు ఎన్నో ఇబ్బందులు పెట్టినప్పటికీ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉక్కు సంకల్పంతో పాదయాత్ర పూర్తి చేశారని తెలిపారు. 400 రోజులు 4000 కిలోమీటర్లు లక్ష్యంగా మొదలైన పాదయాత్ర కొన్ని అనుకోని సంఘటనల వల్ల 230 రోజుల్లో 3100 కిలోమీటర్లు పైగా జరిగిందని తెలిపారు. యువగళం పాదయాత్ర ముగింపు కాదని, నవశకానికి నాంది అని తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడి సమ్మెకు టిడిపి, బిజెపి సంఘీభావం

**విజయపురం, డిసెంబరు 15 ప్రభాతవార్త :**



అంగన్‌వాడి వర్కర్లు చేస్తున్న సమ్మెకు శుక్రవారం టిడిపి, బిజెపి నాయకులు సంఘీభావం తెలిపారు. మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, టిడిపి నాయకులు గజేంద్రనాయుడు మాట్లాడుతూ వారి న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పలువురు అంగన్వాడి, మినీ అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## 20న డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

**పుత్తూరు, డిసెంబరు 15 ప్రభాతవార్త** : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జవహర్ నాలెడ్జి సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జరుగుతుందని కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా పాల్గొంటారన్నారు. 25పైగా కంపెనీలు పాల్గొని తమకు అవసరమైన ఉద్యోగులకు ఎంపిక చేస్తాయన్నారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ, పిజి విద్యార్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని, 20న ఉదయం 9.30 గంటలకు ఆసక్తి వున్న అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు. మేళాకు సంబంధించిన ఇతర వివరాలకు రసూల్-6300954441,కిషోర్-6304330520నెంబర్లు గల వ్యక్తులను సంప్రదించవచ్చని తెలిపారు.

## మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సమర శంఖం పూరించండి

**తిరుపతి టౌన్, డిసెంబర్ 15, ప్రభాతవార్త**



ఈనెల 17,18,19 తేదీల్లో మూడు రోజులపాటు కాళహస్తి పట్టణంలో జరుగుతున్న మహా సభలు సందర్భంగా ఆదివారం పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని ఈ బహిరంగ సభకు పెద్ద ఎత్తున జిల్లాలోని మెడికల్ కాంటాక్ట్ కార్మికులు కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో గల పారిశుద్ధ్య కార్మికులు సెక్యూరిటీ గార్డులు మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకత్వంతో కలిసి ఆయన కరపత్రాలను విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18, 19 తేదీల్లో జరిగే ప్రతినిధులు సభలో జిల్లాలో మెడికల్ కాంటాక్ట్ కార్మికులు ఎదురొంటున్న అనేక సమస్యలపైన చర్చించి పలు తీర్మానాలు చేయబోతున్నామని మహాసభల అనంతరం పెద్ద ఎత్తున పోరాటాలకు సన్నద్ధం కావాలని అందుకు మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కిషోర్, సునీల్, పురుషోత్తం, రూపాదేవి, మీనా, సులోచన, ముద్దుకృష్ణ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## టాటా ట్రస్ట్స్ ఆధ్వర్యంలో తిరుపతికి గాంట్ పే ధ్యాన్

**తిరుపతి టౌన్, డిసెంబర్ 15, ప్రభాతవార్త**



బ్రెస్ట్ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో కొనుగొనడం వలన ప్రయోజనాల గురించి అవగాహన అందిచుట లక్ష్యంగా కలిగిన తన మిషన్‌ను ముందుకు తీసుకెళ్తూ, టాటా ట్రస్ట్స్ తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్, అడ్వాన్స్డ్ రిసెర్చ్‌లో నిర్వహించబడిన ఒక ప్రత్యేక ఈవెంట్ ద్వారా ఒక వినూత్న ప్రయత్నము గాంట్ పే ధ్యాన్‌ను ప్రవేశపెట్టింది. క్రైసే కా క్యాన్సర్ ప్రచారంలో భాగంగా ,గాంట్ పే ధ్యాన్ ఆహారంలో ముద్దలు అనే రూపకం ఉపయోగించి అవగాహనను ఏర్పరచడం, బహిరంగ సంభాషణలను ప్రోత్సహించడం, బ్రెస్ట్ క్యాన్సర్ వైపుకు కమ్యూనిటీ చర్యలకు నడిపించడం, మహిళలలో రొమ్ము యొక్క స్వీయ పరీక్ష యొక్క ప్రాముఖ్యతను ప్రాధాన్యీకరించడం లక్ష్యంగా నిర్వహించబడింది. రోగనిర్ధారణ చికిత్సలో ఈ ఆలస్యం అవగాహన లేకపోవడం వల్ల వస్తుంది, ముందుగా గుర్తించకపోతే ప్రాణాంతకం కావచ్చు. ఒక సాధారణమైన, వినూత్నమైన రూపకాన్ని ఉపయోగించి తొలిదశలోనే కనుగొనడం యొక్క ప్రాముఖ్యతపై మహిళలకు అవగాహన కలిగించడం ద్వారా ఈ సమస్యను ఒక మలుపు తిప్పటానికి టాటా ట్రస్ట్స్ అంకితభావముతో పనిచేస్తోంది. తమ కుటుంబాలకు భోజనం వండటం చాలా మంది మహిళల జీవితాలలో ఒక అంతర్భాగం అవుతుంది. వంట చేయడడంలో, ముఖ్యంగా తమ ఆహారంలో ముద్దలు ఏర్పడకుండా నివారించడంలో మహిళలు తీసుకునే శద నుండి పేరణ తీసుకుంటుందన్నారు. తొలి దశలో కనుగొనడంలో సహాయపడుతుంది, ఇలా చేయడం వలన ప్రాణాలను కాపాడుకోగలగుతామన్నారు.

## శివసర్కిల్ నిర్మాణానికి భూమి పూజ

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రాధాన్యతను తెలియజేసేందుకు బైపాస్ కూడళ్ళ వద్ద వివిధ ఆలయ ప్రాధాన్యతను తెలియజేసే సర్కిళ్ళను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ నుంచి వచ్చే వారికి చెన్నై నుంచి వచ్చే వారు దేవస్థానంకు సులభంగా దారి కనుక్కొనేందుకు సర్కిల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఎపిసీడ్స్ సర్కిల్‌వద్ద 'శివసర్కిల్'ను ఏర్పాటు చేయటానికి భూమి పూజలు జరిపారు. ఇక్కడ శివుడు ధ్యాన ముద్రలో ఉన్నట్లు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో కూడా ఇక్కడ సర్కిల్‌ను ఏర్పాటు చేసారు. అయితే తిరుపతి నుంచి పట్టణంలోకి వచ్చే బస్సులు ఢీకొనటంతో తొలగించారు. ప్రస్తుతం ప్రమాదాలకు అవకాశం లేకుండా సర్కిల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఎఇఇ వేణుగోపాల్‌రెడ్డి, స్థపతి కుమార్, వర్కింగ్ ఇన్స్‌పెక్టర్ బాలాజి, కాంట్రాక్టర్ బాబు పట్టణ ప్రముఖులు మాజీ కౌన్సిలర్ గిరి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రేన్ కింది పడి యువకుడు మృతి

**తిరుపతి క్రైమ్, డిసెంబర్ 15 , ప్రభాతవార్త**

తిరపతి రూరల్ పరిధిలోని విద్యానగర్ సమీపంలో శుక్రవారం క్రేన్ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన సామియేల్ (18) రోడ్డు పై వెళ్లుతున్న క్రేన్ కు సూచనలు ఇస్తూ ఉన్న క్రమంలో క్రేన్ ఎక్కే క్రమంలో పట్టు కోల్పోయి క్రేన్ కింది పడి మృతి చెందాడు. తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రూయ ఆసుపత్రికి తరలించారు.

# తిరుపతి డివిజన్

## ఎమ్మెల్యేగా గెలిపించండి....నిస్వార్థంగా సేవలందిస్తా

- ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని



**తిరుపతిరూరల్, డిసెంబర్15 ప్రభాతవార్త:**

2024 సార్వత్రిక ఎన్నికలలో చంద్రగిరి ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నిస్వార్థం సేవలు అందించి, ప్రజల మన్ననలు పొందటానికి సిద్ధంగా ఉన్నాని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని స్పష్టం చేసారు. బాబు షూరిటీ....భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం గాంధీపురం గ్రామ పంచాయతీలోని శ్రీనగర్ కాలనీ, గరుడ నగర్, గాంధీపురం కాలనీలలో నిర్వహించగా, కాలనీ మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. చినచిన కారణాలతో వైకాపా నాయకులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని స్థానిక మహిళలు వాపోయారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని మాట్లాడుతూ గెలిచిన ఆరు నెలల్లో సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నిస్వార్థంగా పారదర్శకంగా సేవలు అందించటానికి తాను సిద్ధంగా ఉన్నానని, ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, అలిమినేని మధు, జయరామిరెడ్డి, ఎలుక ధనంజయయాదవ్, సాంబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ తపాల ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించండి

- తపాల ఉద్యోగుల నిరవధిక సమ్మెలో ఏఐజిడిఎస్‌యు

**తిరుపతిరూరల్, డిసెంబర్15 ప్రభాతవార్త:**

గ్రామీణ తపాల ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏఐజిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేసారు. తపాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12 నుండి హెడ్ పోస్టాఫీసు వద్ద నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న సంగతి విషయం తెల్సిందే. శుక్రవారం తపాల ఉద్యోగులకు మాజీ ఎంపి డాక్టర్ చింతా మోహన్ మద్దతు తెలిపారు. సమ్మెలో భాగంగా స్థానిక పోస్టాఫీసు నుండి అంబేద్కర్ విగ్రహం, రైల్వే స్టేషన్, నాలుగు కాళ్ళ మండపం మీదగా మునిసిఫల్ కార్యాలయం, గంగమ్మ గుడి మీదగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎన్‌యుజిడిఎస్ ఫైనాన్షియల్ సెక్రటరీ ఎం,మురళి మాట్లాడుతూ గ్రామీణ తపాల ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కొరకు ఆలిండియా లెవల్లో 94శాతం మంది తపాల ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. తిరుపతి డివిజన్ ఏఐజిడిఎస్‌యు కార్యదర్శి రాచపాళ్యం పద్మనాభరెడ్డి మాట్లాడుతూ పని భారం తగ్గించాలని, 12,24, 36 అదనపు సర్వీసు ఇంక్రిమెంట్స్ మంజూరు చేయాలన్నారు. కుటుంబసభ్యులతో సహ వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. తిరుపతి డివిజన్, పుత్తూరు, శ్రీకాళహస్తి, పీలేరు సబ్ డివిజన్ బ్రాంచ్‌ల ప్రతినిధులు మంగళవారం నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు.

## గడప గడపకు ఆత్మీయ పలకరింపులో చెవిరెడ్డి లక్ష్మీ

**తిరుపతిరూరల్, డిసెంబర్15 ప్రభాతవార్త:**



ప్రజా సమస్యలు సావధానంగా వింటూ....సమస్యలు పరిష్కారానికి భరోసా కల్పిస్తూ...మేము ఉన్నామనే ధైర్యాన్ని నింపుతూ చెవిరెడ్డి లక్ష్మీ గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యాక్రమం శుక్రవారం పద్మావతిపురంలో నిర్వహించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ది పనులను ప్రజలకు వివరిస్తూ ముందుగా సాగారు. ఈ సారి ఎన్నికలలో తనయుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి విచ్చేసిన ఆమెకు స్థానిక మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికి, కర్పూర హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మావతిపురం గ్రామ సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్ రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## న 4వ రోజు నల్ల చీరలతో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

**పిచ్చాటూరు, డిసెంబరు 15 ప్రభాతవార్త:**

అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టినా ప్రభుత్వం తలకిందులుగా జపం చేసినా, అంతు చూస్తామని ఆగ్రహించిన సమస్యలు పరిష్కరించేంత వరకు మా ఆందోళన కార్యక్రమం తగ్గేది లేదంటూ 4వ రోజు కూడా సమ్మెను అంగన్‌వాడీ కార్యకర్తలు కొనసాగించారు. శుక్రవారం నల్ల చీరలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిచ్చాటూరు మండలంలో 49 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 23 కేంద్రాలను తాళాలు పగులగొట్టి ఆయా పంచాయతీ కార్యదర్శులకు ఆ కేంద్రాలను స్వాధీనం చేశారు. మిగిలిన 26 కూడా స్వాధీనం చేసుకుంటామని ఆ శాఖకు సంబంధించిన అధికారులు తెలిపారు. కొంత సమస్యాత్మక కేంద్రాలు కావడంతో స్థానికులతో చర్చించి వారి సహకారంతో వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు చిన్న పిల్లలు, గర్భవతుల సౌకర్యార్థం ప్రత్యామ్నాయంగా సంఘమిత్రలు, వలంటీర్లు సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాలను యధావిధిగా కొనసాగించేట్లు చూస్తామని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. పిచ్చాటూరు పట్టణంలో భారీ ర్యాలీతో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు మధ్యాహ్న భోజనం వసతిని ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రస్తుత క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆనందం వ్యక్తపరిచి ఆయనకు అభినందనలు తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ మధుసూదన్‌రావుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ

**పిచ్చాటూరు, డిసెంబరు 15 ప్రభాతవార్త:**

పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం డీఎస్పీ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఈ తనిఖీ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ తనిఖీలో పుత్తూరు సీఐ లక్ష్మినారాయణ, పిచ్చాటూరు, కేవీబీ పురం ఎస్ఐలు వెంకటేశ్వరులు, సునీల్, డీఎస్పీ కార్యాలయ పోలీసులు పాల్గొన్నారు.

## రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ

**రేణిగుంట, డిసెంబరు 15 ప్రభాతవార్త:**

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్-కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో రబీ సీజన్ దృష్ట్యా ధరణి రకం వేరుశనగ విత్తన కాయలను శుక్రవారం పంపిణీ చేశారు. రాస్ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రతి రైతు తమ పొలాల్లో విత్తనాలను సంబంధించిన కాయలను పండించి విత్తన రైతుగా మారాలని కోరారు. కార్యక్రమంలో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డా.ఎస్.శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు వి.దివ్య, ఏ.పద్మజ వడమాలపేట మండలం అప్పలాయగుంట, చింత కాల్వ, పత్తి పుత్తూరు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## అమర వీరులకు ఘనంగా నివాళులు

**రేణిగుంట, డిసెంబరు 15 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆరాధ్యుడు అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కు మనిషి భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ వర్ధంతుల సందర్భంగా టీడీపీ నేతలు రేణిగుంట పట్టణంలో శుక్రవారం శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అధ్యక్షతన, టీడీపీ సీనియర్ నేత అడ్వకేట్ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టీడీపీ శ్రేణులతో కలసి రేణిగుంట పట్టణంలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, పార్టీసీనియర్ నేతలు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 4వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

**రేణిగుంట, డిసెంబరు 15 ప్రభాతవార్త:**



రేణిగుంట మంచినీళ్ళగుంట సమీపంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ చేస్తున్న సమ్మె చేస్తున్న శుక్రవారం 4వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శిబిరం నుంచి మంచినీళ్ళ గుంట వరకు నల్ల చీరలు కట్టుకుని నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి, ఎంపీడీవో, తహసీల్దార్‌కు రేణిగుంట అంగన్‌వాడీ ప్రాజెక్టు సెక్టార్ లీడర్లు వినతిపత్రం సమర్పించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ రేణిగుంట మండల కార్యదర్శి కె.హరినాథ్, అధ్యక్షుడు నరసింహారెడ్డి, సీపీఎం పార్టీ నాయకులు వెంకటరమణ, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనమ్మ, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి రాధమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ సెంటర్ కార్యకర్తలు పాండురంగమ్మ, భాగ్యలక్ష్మి, లావణ్య, రాజేశ్వరి, కోకిల, వనజ, పవిత్ర, విమలమ్మ, వసంత, నిర్మల, పుష్ప, ఖాదర్, నిరసన సమ్మెలో పాల్గొన్నారు.

## కరోనా కష్ట కాలంలో చెవిరెడ్డి సేవలు మరువబోము..!

యువజన నాయకుడికి ఆత్మీయ స్వాగతం

**చంద్రగిరి, డిశంబర్ 15 ప్రభాతవార్త:**

కరోనా కష్ట కాలంలో ఎంఎల్‌ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందించిన సేవలను తాము ఎన్నటికీ మరువబోమని కల్‌రోడ్ పల్లి ప్రజలు అన్నారు. ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు, వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి శుక్రవారం ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డితో కలసి కల్‌రోడ్ పల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరయ్యారు. గడపగడపకు వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 2024 సాధారణ ఎన్నికలలో మా అన్నయ్య, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విజయం కోసం మీరంతా ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకటరత్నం, వైసిపి నాయకులు అగరాల దేవారెడ్డి, సూరి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న రోడ్లు - పట్టించుకోని అధికారులు, పాలకులు

దొరవారిసత్రం, డిసెంబర్ 15 ప్రభాతవార్త


మిచౌంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న రోడ్డు

మిచౌంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న రోడ్లను సంబంధిత అధికారులు గాని, పాలకులు గాని పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని అక్కరపాక, తనయాలి, వెదురుపట్టు, పూలతోట తదితర గ్రామాలకు వెళ్లే ఆర్అండ్బి రోడ్లు దెబ్బతిన్నాయి. మిచౌంగ్ తుపానుకు రోడ్లు దెబ్బతిని పదిరోజులు అవుతుంటే రోడ్లను బాగు చేసి వాహనాల రాకపోకలకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు తప్ప మిగతా ఏ వాహనాలు కూడా ఆ గ్రామాలకు వెళ్లలేకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. అక్కరపాక రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నా పాలకులు గాని, అధికారులు గాని స్పందించకపోవడంతో పాఠశాలలకు వెళ్లే పిల్లలు, వృద్ధులకు కాలిబాట తప్పడం లేదు.

## తాళాలు పగలగొట్టి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
### మండిపడుతున్న ప్రజా సంఘాలు

వెంకటగిరి, డిసెంబర్ 15, ప్రభాతవార్త



అంగన్‌వాడి కేంద్రాలకు వేసిన తాళాలను పగలగొట్టి అధికారులు తరగతులను నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడి కేంద్రాలకు వేసిన తాళాలను పగలగొడుతున్న ప్రజా సంఘాల వారు మండిపడుతున్నారు. అంగన్ వాడి పాఠశాలలకు వేసిన తాళాలు పగలగొట్టి కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. వెంకటగిరిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సమ్మెలో ఉన్న సిబ్బంది వేసిన తాళాలను ఆమె స్వయంగా పగలగొట్టించారు. అంగన్‌వాడి కేంద్రాలకు సిబ్బంది తాళాలు వేసి సమ్మె చేస్తున్న కారణంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశం మేరకు తాళాలు పగలగొట్టించి కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడి కేంద్రాలను సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పాఠశాలల నుండి భోజనం తీసుకొచ్చి పెడతామని తెలిపారు. పౌష్టికాహారాన్ని కూడా పంపిణీ చేస్తామన్నారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నట్లు ఆమె వివరించారు.

## అయోధ్య రామయ్య అక్షింతలు ఊరేగింపు



అయోధ్య అక్షింతలను ఊరేగిస్తున్న స్థానికులు

చౌడేపల్లి, డిసెంబర్ 15 ప్రభాతవార్త

అయోధ్య నుంచి వచ్చిన అంక్షితలు శుక్రవారం పట్టణంలో ఊరేగించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ప్రవీణ్‌కుమార్, శేఖర్, రెడ్డెప్ప, శబరీష్, హరిబాబుల ఆధ్వర్యంలో పట్టణంలో ఊరేగింపు జరిగింది. మండలంలోని 19పంచాయతీలకు అక్షింతలను పంపిణీ చేసారు. జనవరి 1నుంచి 5వరకు ప్రతి ఇంటికీ అక్షింతలు చేరవేస్తామనీ, అయోధ్యలో జనవరి 22న శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట రోజున విశేష పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆనందస్వామి, అనూరాధ, సతీష్, హరి, తదితరులు పాల్గొన్నారు.

## మొదటి ఉపప్రధాని వల్లభాయ్‌పటేల్‌కు నివాళులు

తిరుపతి, డిసెంబర్ 15ప్రభాతవార్త:



దేశ మొదటి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ (ఉక్కుమనిషి) వర్ధంతిని శుక్రవారం ఉదయం తిరు పతిలో రాయలసీమ రంగస్థలి కళాకా రులు జరుపుకు న్నారు. రంగస్థలి కార్యాల యంలో పటేల్ చిత్రపటం ఉంచి ఆయన సేవలను కొనియా డారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, అక్కిపల్లి మునికృష్ణయ్య యాదవ్, కొత్తపల్లి మునిరత్నం, శాంబోలు హరినాథ్, జేజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో బిజెపి కేంద్ర కార్యాలయం ప్రారంభం



.శ్రీకాళహస్తి, డిసెంబర్ 15 ప్రభాతవార్త

రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శుక్రవారం పట్టణంలోని కొత్తపేటలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీ నియోజకవర్గ కేంద్ర పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కోలా.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ కార్యాలయంలోఅందరికి అందుబాటులో ఉంటూ బస్టాండు దగ్గరగా నియోజకవర్గ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభించామని పార్టీని అభివృద్ధి చేసెందుకుక తనవంతు కృషిచేస్తానన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ.ఉమ, జిల్లా కార్యదర్శి మరియు నియోజకవర్గ పార్టీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటిగోపాల్, జిల్లా కార్యదర్శి డాక్టర్ నరేష్, పట్టణ అధ్యక్షులు గరకిపాటి రమేష్‌బాబు, బొబ్బిలిరెడ్డి, కూనాటి నాగరాజు, ఈగలబాలాజీ, సొట్టసుకుమార్, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి చాగణం శైలజ, రాష్ట్ర ఒబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు ఎస్వి.రమణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు కోనేటి అయ్యప్ప, పుణ్యం డిల్లీకుమార్, మద్దు.వాసుయాదవ్,జివి.అమర్‌నాథ్, పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## లోకసుభిక్షం-రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), డిసెంబర్ 15 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయంలో లోక సుభిక్షం కోసం నిర్వ హించిన రాహూకాలాభి షేకానికి విశేష స్పందన లభించింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభి.షేకం, అలంకరణ గావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో పలు కార్యక్రమాలు జరిగాయి. అనంతరం పుష్కరిణీ వద్ద ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అన్నదాన ప్రసాదానికి భక్తులు విరివిగా విరాళాలందించాలని వారు కోరారు. అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

## ప్రకృతి వ్యవసాయంలో జీవ వైవిధ్య కారకాలు

### - జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

పాలసముద్రం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:

ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజల ఆరోగ్యవంతంగా జీవించడానికి, జీవరాశులు మనుగడ సాధించడానికి వీలుంటుందని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రం పాలసముద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రైతు చంద్రశేఖర్‌రాజుకు చెందిన 35 ఎకరాల ప్రకృతి వ్యవసాయ క్షేత్రంను జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులుతో కలిసి ఎంపీ రెడ్డప్ప, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా పశువుల పేడతో చేసి ధూపంను, ఫిర్ జాతికి చెందిన పశువులు, ప్రకృతి వ్యవసాయంతో పెంచుతున్న వివిధ రకాల మొక్కలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ జీవ వైవిధ్య కారకాలు ప్రకృతి వ్యవసాయంలో వుంటాయని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం వుందన్నారు. ప్రకృతి పరంగా జీవ వైవిధ్యంను కాపాడుతున్న విధానంను వారు పరిశీలించారు. ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుకు అండగా వుంటూ లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ ఆధునిక వనయవసాయ సాగు పద్దతులను రైతులకు తెలియజేస్తున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య జీవితం వుంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు స్థానికంగా మంచి డిమాండ్ వుందని, ఉత్పత్తులకు మంచి మార్కెట్ వుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, డ్వామా పిడి గంగాభవానీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



## భూ పరిహారం కోసం రిలే నిరాహార దీక్ష, రాస్తారోకో



వరదయ్యపాలెం, డిసెంబర్ 15, ప్రభాతవార్త

వరదయ్యపాలెం మండలంలో రాచెర్ల గ్రామానికి చెందిన 75 మంది రైతులకు ప్రభుత్వం ద్వారా, ఓ పరిశ్రమకు భూములు ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు పరిహారం అందని బాధితుల పరిహారం కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైసిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి బందిల బాలయ్య అధ్యక్షతన రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గత ఐదు సంవత్సరాలుగా తమకు పరిహారం ఇవ్వకపోవడం దారుణమని, ఈ నెల చివర 30 తారీకు లోపల పరిహారం ఇవ్వకపోతే, నియోజకవర్గం కేంద్రమైన సత్యవేడు నడిబొడ్డులో గాంధీ బొమ్మ వద్ద పెద్ద ఎత్తున కార్యక్రమం చేపడుతామని బాలయ్య, అధికారులను హెచ్చరించారు. అంతే గాక రాచర్ల ఆర్‌బికే వైస్ ఛైర్మన్ భూషణం మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పెద్దలు, ఎస్సీ, ఎస్టీలను చులకన భావంతో చూస్తూ మాకు రావాల్సిన పరిహారాన్ని నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నారని, మాలాంటి పేద వారి కడుపు కొడుతున్నారని వాపోయారు. చిన్న పాండూరు పంచాయితీ, వికేఆర్వై కాలనీకి చెందిన గంగమ్మ ఎస్టీ కులాలమైన మమ్ములను చిన్న చూపు ధోరణితో చూస్తున్నారని ఇంత వరకు మాకు పరిహారం రాకుండా మమ్ములను తిప్పని చోటు అంటూ లేకుండా తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. దీంతో వరదయ్యపాలెం, సత్యవేడు రహదారి మార్గాన భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ నాగార్జుర రెడ్డి సంఘటనా స్థలానికి, ఏఎస్ఐ షణ్ముగంను పంపించి అక్కడ సమస్యను పరిష్కరించాలని తెలపడంతో ఆయన సంఘటన స్థలానికి చేరుకుని అక్కడ బాలయ్యతో మాట్లాడారు. బాలయ్య ససేమిర అనడంతో తహశీల్దార్ గౌరీ శంకర్‌తో చరవాణితో మాట్లాడించడంతో ఈ నెల ఆఖరు లోపు పరిష్కరిస్తామని చెప్పడంతో, దీక్ష విరమింపజేసి, ట్రాఫిక్ పునరుద్దరించారు. ఈ కార్యక్రమంలో మునస్వామి రెడ్డి, ప్రసాద్, చెంగయ్య,

## శబరిమల యాత్రకు పయనమైన వైకాపా బృందం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం ధార్మిక చింతనకు వేదికగా ఉంది. ఈ నేపధ్యంలో ఇక్కడిశాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. శుక్రవారం శాసనసభ్యులు తన పార్టీకి చెందిన 75 మందితో శబరియలకు బయలు దేరారు. ఉదయం నుంచి ఆలయంలోని రంగుల గోపురం పక్కనే ఉన్న వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి ఆలయం వద్ద శబరిమల యాత్రకు వెళ్ళె వైకాపా బృందం 'ఇరుముడి'కట్టుకొనే కార్యక్రమాల్లో తలమునకలయ్యారు. ముందు రోజే ఎంఎల్ఏ మాలధారణ చేసారు.శుక్రవారం ఉదయం నుంచి ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరు కాగా ఇరుముడి కార్యక్రమాలు సాగాయి. ఎంఎల్ఏతో పాటు శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి ఉపాధ్యక్షుడు లక్కమనేని కృష్ణమనాయుడు ఉన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు బుల్లెట్ శ్యాం,మున్నారాయల్,పట్టణ ప్రముఖులు నరసింహారాజు (నంద),లక్ష్మీపతి,పిఎం చంద్ర, ఆలయ ఇఓ సిసి చేజర్ల హరిలు రెండు ప్రత్యేక బస్సుల్లో పయనమయ్యారు.కాగా పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం నాలుగుమాడావీధుల్లో అయ్యప్ప నామస్మరణ చేస్తూ అయ్యప్ప పాటలు పాడుకుంటూ ఊరేగింపు జరిపారు.ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,తొట్టంబేడు నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, శ్రీకాళహస్తి నాయకుడు బ్రహ్మెహేమభూషణరెడ్డి,శ్రీకాళహస్తి మండల నాయకుడు వయ్యాల కృష్ణారెడ్డి వైకాపా పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## కోర్కెలు తీర్చుకునే వేదికే ఇహలోకం.. పరలోకం గురించి తెలుసుకోవాలి: రేహాన్

శ్రీకాళహస్తి,డిసెంబర్ 15 ప్రభాతవార్త



ఇహలోకం కోర్కెలు తీర్చుకునే ఒక వేదికే అని, మనిషి పుట్టుక గురించి తెలుసుకొని మసలుకోవాలని,ఈ జీవితం అశాశ్వతమన్నారు.ఈ శరీరం మట్టిలో కలసి పోతుందని మనం చేసే మంచి పనులు దైవ ప్రార్ధన పరలోకంలో మనకు స్వర్గం ప్రాప్తించేలా చేస్తుందని హాఫీజే ఖురల్ అన్ రేహాన్ సాహెబ్ అన్నారు.అందుకు మనం గురువులను ఆశ్రయించి వారి బోధనలను వినాలన్నారు. అంతేకాక ఇస్లాం మతాన్ని గురించి తెలుసుకోవాలంటే మనం జమాత్‌లతో వెళ్ళాలని పిలుపు నిచ్చారు. ఆధ్యాత్మిక ప్రసంగాలను చెవులు రిక్కించి వినటం కాదు. విన్న ప్రసంగాల్లోని సారాంశాన్ని ఆచరించాలని హాఫీజే ఖుర్ అన్ రేహాన్ అన్నారు. శుక్రవారం జామియామస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్ధనల తరువాత ఆయన మానవుని అల్లాహ్ ఎందుకు సృష్టించారు.మానవుని జీవిత రహస్యం,మరణం గురించి అవగాహన కల్పించుకోవాలన్నారు. అల్లాహ్ మానవుని తన ఆరాధన కోసం సృష్టించి సకల సుఖాలను అందించారని అయితే పుట్టిన వాడు గిట్టక మానడు.మానవ జీవితం మజిలి మాత్రమే అని ఇది శాశ్వతం కాదనే సత్యాన్ని గ్రహించి మరణం తరువాత నిజమైన జీవితం ప్రారంభం అవుతుందన్నారు.మనం అల్లాహ్ ఆదేశాలను ఆచరిస్తూ మన ప్రవక్త ఆచరించిన సిద్దాంతాలను ఆచరిస్తూ ప్రశాంత జీవనం గడపాలని పిలుపు నిచ్చారు.

## గణనాధుని సేవలో రాష్ట్ర లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ

కాణిపాకం, డిసెంబర్ 15 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ భబిత శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆమె వెంట స్థానిక ఎస్పై శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తెరచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు..
### హాజరుకాని చిన్నారులు
#### -తాళాలు పగులగొట్టి పంచనామా..

తొట్టంబేడు, డిసెంబర్15 ప్రభాతవార్త



అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు మూడు రోజులుగా తమ డిమాండ్ల పరిష్కారానికి చేస్తున్న దీక్షలపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. నేటి నుంచి సచివాలయాల్లో ఉన్న డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసు సిబ్బంది తదితరులతో అంగన్‌వాడీ కేంద్రాలను నేటి నుంచి నడపాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు ఎంపిడిఓ సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురం, గుండేలిగుంట, పిల్లమేడు, తదితర గ్రామాల్లో పంచనామా నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను పగులగొట్టారు. అయితే చిన్నారులు మాత్రం హాజరు కాలేదు. శుక్రవారం కూడా యధావిధిగా శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు వద్ద నిరసన తెలిపారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ నేతలు, జనసేన నేతలు మద్దతు తెలిపారు.

## ఉద్యోగుల స్పందనకు 7 సమస్యలు

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:



ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రతి నెల మూడవ శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం ఉద్యోగుల నుండి 7 సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయి. డిఆర్ఓ రాజశేఖర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఉద్యోగుల స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ నుండి 3, డిఎంహెచ్ఓ, విద్యాశాఖ, భూగర్భ జలవనరులశాఖ, చిత్తూరు మున్సిపాల్టీల నుండి ఒక్కొక్క సమస్య అధికారుల దృష్టికి వచ్చింది.

## 15వ ఆర్థిక సంఘ నిధులపై పక్కాగా స్పెషల్ డ్రైవ్

చిత్తూరు, డిసెంబర్ 15 ప్రభాతవార్త:



15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన పనులు, బిల్లుల చెల్లింపులపై పక్కాగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పూర్తి చేయాలని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. జడ్పీ పాత ఆడిట్ కార్యాలయంలో 15వ ఆర్థిక సంఘ నిధుల పనులు, బిల్లుల చెల్లింపుపై జరుగుతున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంను జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘ నిధులతో చేపట్టిన పనులు, బిల్లులు, పెండింగ్‌లో వున్న పనులను గుర్తించి సత్వరం చేపట్టి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘ నిధులను సకాలంలో ఖర్చు చేయకుంటే నిధులు మురిగిపోతాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజు నాలుగైదు మండలాలకు చెందిన పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులు, జడ్పీ గ్రాంట్స్‌కు సంబంధించిన అధికారులు వచ్చి ఈ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్‌సి షణ్ముగరామ్, మండల పరిషత్ కార్యాలయాల సిబ్బంది, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకై న్యాయవాదుల నిరసన




కుప్పం, డిసెంబర్ 15 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకోచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27ఆఫ్2023ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ కుప్పంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. పట్టణంలో రా ్యలీ నిర్వహించి డా॥ అంబేద్కర్ విగ్రహంకు వినతిపత్రం అందించారు. ఈస ందర్భంగా వారు మాట్లాడుతూ భూహక్కుల పరిష్కారం తీర్మానం చేసేందుకు ఈ చట్టం ద్వారా రెవెన్యూ శాఖకు పూర్తి అధికారాలు ఇవ్వడం తగదన్నారు. భూహక్కుల గురించి రెవెన్యూ అధికారులకు హక్కుల తీర్మానం చేసే అధికారం లేదని చట్టాలు ఉన్నాతుంగలో తొక్కడం దారుణమన్నారు. ఈ చట్ ్టం ద్వారా ప్రజల స్థిరాస్తి హక్కులను న్యాయవ్యవస్థ పరిధినుంచి తొలగించి రాజకీయ కబంధ హస్తాల్లో తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వ ం వెంటనే ఈచట్టాన్ని రద్దు చేయాలని, ప్రజా ప్రతినిధులు కూడా తమకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీకాంత్, నటరాజన్, మధుసూధన్, హరికృష్ణ, సిద్ధవటం నాగరాజు, మురుగన్, గుణశేఖర్,పుష్పలత, మాధవి, అమర్‌నాథ్, సుధాకర్, శ్రీకాంత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కార్యకర్తలకు తెలుగు మహిళలు మద్దతు

గూడూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలో ఆర్డిఓ ఆఫీస్ సమీపంలో అంగన్‌వాడి కార్యకర్తల సమ్మె రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారంకు నాలుగు రోజుకు చేరుకుంది. నిరసన కార్యక్రమంలో టిడిపి మహిళలు పాల్గొని తమ పూర్తి మద్దతు తెలియజేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా టిడిపి మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ పసి పిల్లలను తమ సొంత పిల్లలు లాగా ప్రతినిత్యం ఇంటికి దగ్గరికి వచ్చి తీసుకొని వెళ్లి మరల తీసుకుని వచ్చి ఇంటి దగ్గర వదిలి వెళ్తున్నారని, ప్రతి రోజు పసిపిల్లల ఆలనా పాలన చూసే దాంట్లో తల్లులు లాంటి వారని, ప్రభుత్వం వెంటనే గత నాలుగు రోజులుగా ఆకలి దప్పులతో సమ్మె చేస్తున్న అంగన్‌వాడి కార్యకర్తలను దృష్టిలో ఉంచుకుని వెంటనే వేతనాలు పెంచి వారి న్యాయమైన న్యాయపరమైన సమస్యలు తీర్చాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి బత్తిన ప్రమీల, మండల మహిళా అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి, నెలటూరు సుప్రజ, గురునాథం, సునీత, పర్వీద్, సుధా, అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఏ. ఇంద్రావతి, గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి, శివకుమార్, పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి ఎస్. సురేష్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, బి. గోపీనాథ్, దారా, కోటి, ఏ. ప్రసాద్, పామంజి మణి, బి. చంద్రయ్య, శిబిరం వద్దకు యుటిఎఫ్ నాయకులు, శ్రామిక మహిళ సంఘం అధ్యక్షురాలు నక్క ప్రభావతి, సంపూర్ణమ్మ, ఏఐటియుసి నాయకులు శశి, ఎంబేటి చంద్రయ్య, శిబిరం వద్దకు వచ్చి తమ పూర్తి మద్దతు తెలియజేస్తూ ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడి కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేసారు.